# మానవ వికాస వేదిక

# 2వ రాష్ట్ర మహాసభలు

## 2008 జనవరి 12,13 తేదీల్లో
## సింగరేణి కమ్యూనిటీ హాల్, గోదావరిఖని, కరీంనగర్ జిల్లా

### కార్యదర్శి నివేదిక

మిత్రులారా!

మానవుడే అన్నింటికీ ప్రమాణంగా వుండాలని, ఈ భూమ్మీద సుఖజీవనం మానవ కృషితోనే సాధ్యమవుతుందని, చెప్పే మానవవాదం ఈనాడు ప్రపంచమంతటా విస్తరిస్తోంది. మానవుడే మహనీయుడని, మాననీయుడన్న భావనను నిరూపించే ఘటనలు రోజురోజుకీ పెరుగుతున్నాయి.

మానవ ఔన్నత్యాన్ని తగ్గించి, దైవానికీ, అతీతశక్తులకీ, మహాత్ములకీ, పవిత్ర గ్రంధాలకీ నిలయంగా వుండే ప్రతి మతమూ మానవుని అభివృద్ధికి అడ్డుగోడేనన్న వాస్తవం కూడా రోజురోజుకీ రుజువవుతున్నది. మానవవాదుల ప్రచారాలు, ప్రమేయం లేకుండానే మతోన్మాదం ఉగ్రరూపం దాల్చుతూ స్వ, పర భేదం లేకుండా మారణకాండకు ఉరకలేస్తున్నది. మతవాదుల వల్లే సమాజంలో అస్థిరత, అభద్రత, అశాంతి, హింసాకాండ పెచ్చుమీరుతున్నాయి తప్ప మానవవాదుల వల్ల కాదన్న నిజం తేటతెల్లమవుతున్నది. ప్రపంచపటంలో ఏ ఖండంలో, ఏ దేశంలో, ఏప్రాంతంలో హింస చెలరేగినా, దాని వెనుక మనుషుల మధ్య నెలకొన్న అసమానతల వల్ల ఏర్పడే అసూయా, విద్వేషాలే తప్ప, మానవవాదం ప్రబోధించే శాంతి, సమైక్యత, సహజీవనం, సమానత్వం వంటి సాంఘిక విలువల వల్ల కాదని మనం తేలిగ్గా గ్రహించవచ్చు.

మానవవాదం సమాజ అభ్యున్నతికి మార్గదర్శకమైన సిద్ధాంతం. మన దేశంలో, లేదా మన రాష్ట్రంలో పెరిగిపోతున్న అవినీతికి, రాజకీయ అనిశ్చితికి, విలువల పతనానికి, అప్రజాస్వామిక ఆర్థిక విధానాలకు, కునారిల్లుతున్న బడుగుజీవుల దౌర్భాగ్యానికి మానవవాదం మంచి మార్గాన్ని చూపుతుంది.

అందుకే రాష్ట్రంలో మానవవాద భావజాలాన్ని ప్రచారం చేయటం ద్వారా ప్రజల ఆలోచనల్లో భావవిప్లవానికి పాదులు వేయాలన్న కోరికతో మానవ వికాస వేదిక ఆవిర్భవించింది. 2004 సెప్టెంబర్ 12న 6 జిల్లాల నుంచి వచ్చిన 34 మంది కార్యకర్తలతో అభిమానులతో హైదరాబాద్‌లో ఏర్పడిన,ఆ సంస్థ కొద్ది నెలల్లోనే 200మంది సభ్యులను పొంది, 2005 జనవరి 11,12 తేదీల్లో తొలి రాష్ట్ర మహాసభలను నిర్వహించుకోగల్గింది.

దేశం గర్వించదగ్గ శాస్త్రవేత్త పద్మభూషణ్ డా॥పి.యం.భార్గవ ఈ మహాసభలను ప్రారంభిస్తూ మానవవాద భావాలు సమాజ రుగ్మతలకు సరైన మందన్నారు. సైన్సు, మానవ[illegible] మా.వి.వే. లోగోను చందనా చక్రవర్తి ఆవిష్కరించగా 'మానవ వికాసం' మాసపత్రిక తొలిసంచికను 'విజయ విహారం' సంపాదకులు రమణమూర్తిగారు ఆవిష్కరించారు. మా.వి.వే. ఆశయాలకు అక్షరాకృతినిచ్చిన సంస్థ ప్రణాళికను ఐ.హెచ్.ఇ.యు.కు అపుడు ఎగ్జిక్యూటివ్ డైరక్టర్‌గా వుండి, ఇపుడు ఇంటర్నేషనల్ డైరక్టర్‌గా వున్న బి.ఆర్.ఆర్.బాబుగారు విడుదల చేసారు. ఆ సభల్లో ఇంకా డా॥ఎన్.ఇన్నయ్యగారు, మల్లాది సుబ్బమ్మ, జయప్రకాశ్ నారాయణ గారు, డా॥బ్రహ్మారెడ్డిగారు, జయరామరెడ్డిగారు ఇంకా పలువురు మిత్రసంఘాల ప్రతినిధులు పాల్గొని మానవ వికాస వేదిక అభివృద్ధిని మనసారా ఆకాంక్షించారు. వారి ఆకాంక్షల స్థాయిని అందుకోలేకపోయినా, ఈ మూడేళ్ళలో తన ఆశయాల ప్రచారానికి సంస్థ శక్తిమేరకు ప్రయత్నించింది. వాటి వివరాలు క్రమంగా అందిస్తున్నాను.

## 2005 జనవరి నుండి 2007 డిసెంబర్ వరకు మా.వి.వే. కార్యక్రమాలు

### 2005లో......

1. 1-03-05 రంగారెడ్డి జిల్లాశాఖ శామీరుపేటలో జాతీయ సైన్సు దినోత్సవ సభను నిర్వహించింది.
2. 15-3-05న అదే జిల్లా బసిరెడ్డి పల్లిలో ఒక గొర్రెల కాపరి 'కృష్ణానంద స్వామి'గా చెప్పుకుంటూ నోటి నుంచి వజ్రాలు, రత్నాలు ఉమ్ముతున్నాడని జనం అమాయకంగా నమ్మి మోసపోతుంటే 'తేజ'టీవీతో, జన విజ్ఞాన వేదికతో కలిసి మా.వి.వే. అధ్యక్షుడు విక్రమ్ వెళ్ళి వాని బండారాన్ని ప్రజల ముందు బట్టబయలు చేసి వచ్చారు.
3. 20-03-05 నాడు ఆరోగ్యమంత్రి రోశయ్యను కలసి అశాస్త్రీయ వైద్యవిధానాలను అరికట్టమని కోరుతూ మిత్ర సంఘాలతో కలసి మెమొరాండం సమర్పణ.
4. 24-04-05న రంగారెడ్డి జిల్లా కార్యకర్తలకు మా.వి.వే. ఉద్దేశాలు - కర్తవ్యాలు పై అవగాహనా సదస్సు హైదరాబాద్‌లో. 24-04-05న ఢిల్లీలోని ఆంధ్రప్రదేశ్ భవన్‌లో జరిగిన 'తెలుగు కళాసంఘం' వారి వార్షికోత్సవ సభలో మా.వి.వే. నాయకులు విక్రమ్, స్వరాజ్యలక్ష్మి పాల్గొని 'మహిమల బండారం', 'సైకిక్ సర్జరీ' ప్రదర్శనలిచ్చి పలువురి ప్రశంసలు అందుకున్నారు.
6. 30-04-05న కరీంనగర్ జిల్లా కార్యకర్తలకు అవగాహనా సదస్సు హుజూరాబాద్‌లో.
7. 1-05-05నాడు ఆదిలాబాద్ జిల్లా కార్యకర్తలకు అవగాహనా సదస్సు లక్సెట్టిపేటలో.
8. 8-05-05నాడు హైదరాబాద్ జిల్లా కార్యకర్తల అవగాహనా సదస్సు సోమాజీగూడలో జరిగింది.
9. 25-05-05 బుద్ధజయంతి సందర్భంగా కరీంనగర్ జిల్లా, జమ్మికుంట మండలం పోతర్లపల్లిలో 'ఉచిత కంటి వైద్య శిబిరం' నిర్వహణ. 400మంది రోగులకు కంటి పరీక్షలు.
10. జులై 9,10 తేదీల్లో కరీంనగర్‌లో కార్యకర్తలకు 'నాయకత్వ శిక్షణా శిబిరం', 'వ్యాయామ శిక్షణ'
11. 28-08-05 నుండి సెప్టెంబర్ వరకు మెదక్, రంగారెడ్డి, కరీంనగర్, మహబూబ్ నగర్, నల్లగొండ, విశాఖపట్నం, ఆదిలాబాద్, హైదరాబాద్‌లలో 'భౌతికశాస్త్ర ప్రతిభా పరీక్ష'ల నిర్వహణ. మండల స్థాయిలో ప్రతి పాఠశాల నుండి 5గురు విద్యార్థుల్ని మాత్రమే తీసుకుని, పరీక్ష పెట్టి వారి నుండి ప్రతిభామూర్తుల్ని ఎంచి, ప్రజల సమక్షంలో వారిని సన్మానించే కార్యక్రమం. మొత్తం 1500 మంది విద్యార్థులు ఈ పరీక్షలు రాసారు.
12. అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా డిసెంబర్ 11న హైదరాబాద్‌లో 'కులనిర్మూలనా సదస్సు'. ప్రొ॥హరగోపాల్, కేశవరావ్ జాదవ్, మల్లాది సుబ్బమ్మ, గూడ అంజయ్యలాంటి ప్రముఖులు వక్తలుగా హాజరయ్యారు.